కథావేదిక

# అసలు సంగతి

## - ముచ్చర్ల రజనీ శకుంతల

బాల్కనీలో టికెట్స్ కట్‌చేసి అందర్నీ లోపలికి పంపిస్తున్నాను. పాత సినిమా అవడంవలన అనుకుంటా ఎక్కువ జనంలేరు. అయినా ఈ రోజుల్లో సినిమా చూసేవాళ్లు చాలా తక్కువ అయిపోయారు. ఇంట్లో ఫ్యాను కింద కూర్చుని వివిధ ఛానల్స్‌వారు పోటీపడి మరీ అన్నిర కాల సినిమాలూ వేస్తుంటే థియేటర్‌కి వచ్చి టిక్కెట్ కొనుక్కుని చూసేవారెవరుంటారు? అందుకేనేమో మాలాంటి వాళ్ల పని హాయిగా వుంది. ఏ రష్ లేకపోతే నింపాదిగా మా పని మేం చేసుకోవడం ఈజీగా వుంటుంది.

అందుకే జీతం తక్కువైనా నేనీ ఉద్యోగంలో స్థిరపడిపోయాను.

నా ఆలోచనలు సాగుతూనే ఉన్నాయి. ఫస్ట్‌బెల్ కొట్టారు. చుట్టూ గమనిస్తూ నిలబడ్డాను. బహుశా కథలు వ్రాయడం నా హాబీ అని కాబోలు నాకు కాస్త అబ్జర్వేషన్ పవర్ ఎక్కువ. ఇతరుల మనసుల్ని తెరిచిన పుస్తకంలా చదివేయగలగడం కూడా ఓ గొప్ప కళ. అలాంటి కళ నాలో వున్నందుకు నేను చాలా సంతోషప డుతుంటాను.

మూడో బెల్ రింగ్ అవుతోంది. హడావుడిగా ఓ జంట వచ్చారు. ఆమె చాలా అందంగా వుంది.

అద్దాలు కుట్టిన బ్లూకలర్ చుడీదార్‌లో అందంగా మెరిసిపోతోంది. మిస్ ఇండియా కొలతలతో అందంగా వెలిగిపోతోంది. ఎంతయినా మగాడ్నికదా! అందం కన బడగానే చూడకుండా వుండలేను.

ఆమెతో వచ్చినతను కూడా ఫర్వాలేదు. ఇద్దరూ లోప లికి వెళ్లారు. వెనుకగా ఓ మూల సీట్లో కూర్చున్నారు. ప్రేమజంట కాబోలని అనుకున్నాను. ఏదేవే! అప్పుడ ప్పుడు మాత్రం ఆ అమ్మాయిని గమనిస్తునే ఉన్నాను.

అతను ఏమన్నాడోగానీ కిలకిలా నవ్వుతోందా అమ్మాయి. పిక్చర్ స్టార్ట్ అయింది. నేను పరదావేసి డోర్ దగ్గరకేసి ఇక వచ్చేవాళ్లెవరూ వుండరని తెలిసి చాయ్ తాగుదామని బయటకి నడిచాను. నా మనసులో మాత్రం అందమైన ఆ జంటే మెదులుతున్నారు. సిని మాకి వచ్చేవాళ్లని ఎంతోమందిని అబ్జర్వ్ చేస్తుంటాను కదా! అదే బాగా అలవాటైపోయింది. అందరి గురించి ఆలోచిస్తుంటాను. ఏమిటో! ఓ రెండున్నర గంటలసేపు సినిమా చూసి ఎవరిదారిన వాళ్లు వెళ్లిపోతారు. వాళ్ల గురించి అనవసరంగా నేనెందుకు ఆలోచించాలి? అని ఎన్నిసార్లు అనుకున్నా ఆలోచించకుండా మాత్రం ఉండలేను. అది నా వీక్‌నెస్ కావచ్చు.

''ఏం గురూ! ఇంకో పదినిముషాల్లో రెయిన్ సాంగ్ వస్తుంది. చూద్దామా'' అంటూ రాంబాబు వచ్చాడు నా దగ్గరికి.

''నువ్వు వెళ్లి చూడరా. నాకు విసుగొచ్చింది'' అన్నాను.

''హీరోయిన్ ఒంపుసొంపులు చూడ్డానికి విసుగే మిత్రా. మరీ విడ్డూరం కాకపోతే'' అని విసుక్కుని వాడు వెళ్లిపోయాడు.

నా ఆలోచనలో నేను పడిపోయాను. కాసేపటికి ఇంట ర్వెల్ అయింది. నేను క్యాంటిన్ దగ్గరే నిలబడి సిగరెట్ కాలుస్తున్నాను. ఆ అందాల భామతో వచ్చినతను రెండు చిప్స్ ప్యాకెట్స్, కోక్ కొనుక్కుని వెళ్లాడు.

సినిమా మొదలుపెట్టడంతో నేను వెళ్లి కాలక్షేపానికి గేట్ దగ్గర నిలబడ్డాను ఆ జంటని గమనిస్తూ.

హాయిగా ఏ చీకూ చింతా లేనివాళ్లలా నవ్వుతూ మాట్లాడుకుంటున్నారిద్దరూ. పెళ్లి అయిందో లేదో అనుకున్నాను సహజమయిన కుతూహలంతో.

'పెళ్లయితే ఇంత సరదాగా వుంటారా?' అనుకు న్నాను మళ్లీ.

సినిమా ముగిసిన తరువాత ఆమె కాళ్లకు మట్టెలు కన బడతాయేమోనని వెతికాను. ఉన్న ఆ కొంచెం జనంలో నాకు సరిగ్గా చూడ్డానికి వీలుకాలేదు. సినిమా అయిపో యాక మాత్రం ఆమె కూర్చున్న సీటు దగ్గర కాలిది వెండిపట్టీ దొరికిందని బోయ్ తెచ్చిచ్చాడు. జాగ్రత్తగా దాచి పెట్టాను.

• • •

పదిరోజుల తరువాత అనుకుంటా సినిమా మారింది. మరీ పాత పిక్చర్ కావడంతో నలుగురు అయిదుగురు తప్ప ఎవరూలేరు థియేటర్‌లో.

ఆలోచిస్తూ నిలబడ్డ నాకు నవ్వులు వినబడ్డాయి పక్క నుండి. వెనక్కి తిరిగి చూసాను. ఓ మెరుపు మెరిసినట్ట యింది. ఆ అందాలరాశి మెరూన్ కలర్ చీరలో మెరిసి పోతూ... నేను ఆశ్చర్యంగా చూస్తున్నాను. నా ఆశ్చర్యా నికి ఆమె అందం ఓ కారణమైతే ఆమె పక్కనున్న కుర్రాడు మరో కారణం. ఆమె కాలిపట్టి మెదిలింది మనసులో.

అతను అందంగా, హుందాగా జేబులో చేతులు పెట్టుకుని నవ్వుతూ వస్తున్నాడు. ఆమె అతన్ని అంటు కుని నడిచివస్తోంది. నాలో ఏదో బాధ కలుక్కుమంది.

మొన్న చుడీదార్‌లో వచ్చింది వేరే అబ్బాయితో. ఈ రోజు చీరలో వచ్చింది వేరే అతనితో. ఇద్దరితోనూ నవ్వుతూ, తుళ్లుతూ...ఎంత మోసం! ఎంత దగా! ఆడ వాళ్లు నిజంగా ఎంతకయినా తెగిస్తారు. ఛీ...ఛీ... వాళ్లంత మోసగాళ్లు ఎవరూ ఉండరు?

తమ అందంతో మగాళ్లని మోసం చేస్తారు. అదే మగాళ్లు మోసం చేస్తే ప్రజలు దుమ్మెత్తిపోస్తారు. మరి ఇలాంటి ఆడవాళ్ల సంగతేంటి?

అతను రెండు టిక్కెట్స్ నా చేతిలో పెట్టాడు. కసిగా వాటిని చింపి అతనికిచ్చాను. కోపంగా ఆమెవైపు చూసాను. ఆమె అదేమీ పట్టించుకోనట్లు వెళ్లిపో యింది. ఇంత అందమైన ఆమెకు అంత వికారమైన బుద్ధులెలా వచ్చాయో? ఇద్దరూ వెళ్లి ఓ మూల సీట్లలో కూర్చున్నారు. నేను వాళ్లని గమనిస్తూ నిలబడ్డాను. మునుపటికంటే హుషారుగా ఉందా అమ్మాయి. అతను నవ్వుతూ ఏదో అని ఆమె బుగ్గ గిల్లాడు.

మరింత నవ్విందా అమ్మాయి.

''ఛీ...ఛీ'' ఇవతలికి వచ్చేసాను నేను.

అయినా నా కడుపు మండిపోతోంది. ఇంకా ఎంత మంది మగాళ్లతో తిరుగుతోందో ఆ అమ్మాయి?

''గురూ! మంచి స్పెషల్ టీ ఇద్దరికీ కొట్టు గురూ'' అంటూ రాంబాబు వచ్చాడు. నేను ఆవేశంగా మొన్న చూసిన అమ్మాయి సంగతి అంతా చెప్పేశాను వాడికి. వాడు చిరునవ్వు నవ్వుతూ ''మనకెందుకురా! అయినా లవర్స్ లాంటివాళ్లే మన హాల్‌కి వస్తారు. వాళ్లు వచ్చేది సినిమా కోసమా చెప్పు. మనకి తెలియంది ఏముంది'' అంటూ నవ్వుతూ కొట్టేసాడు.

''కాదురా! ఒకే అమ్మాయి పదిరోజుల్లో మరో అబ్బా యితో...'' కోపంగా అన్నాను.

''రోజుకో అబ్బాయితో వస్తుందిరా. మనకేంటి? మనమేం చేయగలం చెప్పు?'' తేలిగ్గా అన్నాడు.

''ఏమీ చెయలేమా?''

''ఊహూ''

''నెవ్వర్. ఏదో ఒకటి చేయాల్రా'' అన్నాను స్థిరంగా.

''నీ మొహంగానీ ముందు చాయ్ తాగు'' అంటూ అందించాడు రాంబాబు. ఒక స్థిర నిశ్చయానికి వచ్చి నట్లు గ్లాసు అందుకున్నాడు.

• • •

ఇంటర్వెల్‌లో అతను కూల్‌డ్రింక్స్ కోసం బయటకి వచ్చాడు. నేను ఏమైతే అదే అవుతుందన్న ఉద్దేశ్యంతో అతన్ని ''సార్! ఒక్కసారి ఇలా వస్తారా?'' అన్నాను ధైర్యంగా. అతను ఆశ్చర్యంగా చూస్తూ ''మీరు?'' అన్నాడు. నేను కాస్త పక్కగా అతన్ని తీసుకువెళ్లి-

''నేనిక్కడ గేట్ దగ్గర బాల్కనీ టిక్కెట్స్ కట్ చేసే బోయ్‌ని'' అన్నాను.

‘‘అయితే...’’ అతను మరింతగా ఆశ్చర్యంగా అన్నాడు.

‘‘మీకు...మీకు ఒక్కమాట చెప్పాలి’’ నసుగుతూ అన్నాను.


‘‘ఏమిటి?’’

నాకు బిపి పెరుగుతోంది. ఆవిడ అలాంటిదని చెప్తే... కొడితే ఎక్కడో భయం మొదలయింది. అయినా చెప్పక పోతే సాటి మగాడికి జరిగే అన్యాయం చూస్తూ ఊరుకో లేనేమో అనిపిస్తోంది. ఈ టెన్షన్ తట్టుకోవడం మహా కష్టంగా ఉంది. ఆఖరికి ఏదైతే అదే అవుతుందని గబ గబా చెప్పేశాను.

‘‘మీతో వచ్చినావిడ పదిరోజుల క్రితం వచ్చినప్పుడు ఓ పట్టీ పారేసుకుంది. మళ్లీ కలిస్తే ఇచ్చేద్దామని నా దగ్గర దాచిపెట్టాను. ఇదిగో’’ అంటూ జేబులోంచి తీసి చూపించాను.

‘‘భలేవారే. ఈ రోజుల్లో కూడా మీలా ఇంత నిజాయి తీపరులున్నారంటే ఆశ్చర్యమే’’ అతను కృతజ్ఞతగా అంటూ తీసుకున్నాడు.

‘‘కానీ... అప్పుడు ఆమెతో వచ్చింది మీరు కాదు. మరెవరో...’’ ధైర్యంగా అనేసాను.



అంతకుముందే అంత నిజాయితీగా పట్టీ ఇచ్చిన నేను అబద్ధం చెప్పనని అతనికి గట్టి నమ్మకం అని నా ఉద్దేశ్యం. నా మాటలకి మాత్రం అదోలా చూసి ‘‘ఇట్స్ ఓకే. నేను తనని అడుగుతాను’’ అంటూ వెళ్లిపో యాడు.

తర్వాత నేను గేటు దగ్గర నిలబడ్డప్పుడు ఆమె నావైపు గుచ్చిగుచ్చి చూడడం గమనించాను.

పట్టీ దొరికినందుకు సంతోషపడుతోందో లేక తన బండారం బయట పడినందుకు బాధపడుతోందో అను కున్నాను నేను.

సినిమా అయిపోయాక ఇద్దరూ వెళ్లిపోతున్నారు. నేను స్టిల్స్ గమనిస్తున్నట్లుగా నటిస్తూ అక్కడే నిలబడ్డాను. నా ఉద్దేశ్యం ప్రకారం ఈసారి అతను నా దగ్గరికి తప్పక వచ్చి థాంక్స్ చెప్తాడనుకున్నాను. కరెక్టుగా నేను ఊహించినట్లే అతను నావైపు వస్తున్నాడు.

‘‘మీకు థాంక్స్. అన్నట్లు వచ్చే ఆదివారం మీ కోసం ఫస్ట్‌షోకి వస్తాం. అంతవరకూ వెయిట్ చేయండి’’ అంటూ వెళ్లిపోయాడతను. ఆమె వెనక్కి తిరిగి నన్నోసారి చూసింది. నేను ఆశ్చర్యంగా వాళ్లనే చూస్తున్నాను.

• • •

ఆదివారంవరకు నేనామెను తిట్టుకుంటూనే ఉన్నాను. కారణం మోసగత్తె అనే అనుమానంతో. ఆమె మరొకరితో వచ్చిందని అత నితో చెప్పినా ఏం తేడా లేదతనిలో. కారణం ఏమై వుంటుంది? ఆదివారం నాకోసం ఎందుకొస్తారబ్బా! ఏమిటో! అనుకుంటూ గడిపేశాను.

• • •

ఆదివారం రానే వచ్చింది. నాకా రోజు జ్వరంగా వున్న ట్లనిపించినా కేవలం వాళ్లకోసం బయలుదేరాను. టిక్కెట్స్ ఇస్తున్నారు. ఫస్ట్‌బెల్ మోగింది.

అయినా ఆ జంట రాలేదు. నేను అనుకోకుండానే నిరాశగా నిలబడ్డాను. రెండో బెల్ మోగుతున్నప్పుడు ‘‘హలో మాస్టారూ’’ అంటూ నా భుజంమీద తట్టడంతో ఇటు తిరిగాను.

ఉద్వేగంతో చూసాను. కారణం ఇద్దరు మెరుపుతీగలు నా కళ్లముందు. ఒకరు చుడీదార్‌లో, మరొకరు చీరలో. నేను ఆశ్చర్యంగా చూసాను.

‘‘హలో! నా పట్టీ ఇచ్చినందుకు థాంక్స్’’ అన్నారా అమ్మాయిలు ఇద్దరూ ఒకేసారి.

‘‘మీరు...మీలో...ఎవరిదీ?’’

‘‘చెప్పుకోండి చూద్దాం’’ అన్నారిద్దరు. నేను తెల్లమొఖం వేసాను. నన్ను చూసి కాబోలు ఆ ఇద్దరు మగాళ్లు నవ్వేస్తూ ‘‘ఏయ్! ఇక ఏడిపించింది చాలు’’ అన్నారు.

‘‘అంటే వీళ్లు...?’’

‘‘కవలలు’’ అన్నారు అమ్మాయిలిద్దరూ.

‘‘నిజమా! ఐయామ్ వెరీ సారీ మేడమ్’’ అన్నాను నా ఊహ తప్పయినందుకు.

‘‘ఓకే! బహుశా మీరు రచయితలేమో! అందుకే అతిగా ఆలోచించారు. ఎనీవే థాంక్స్ ఎలాగో’’ అంటూ నాకు షేక్‌హ్యాండ్ ఇస్తుంటే ఎందుకో సిగ్గనిపించింది.

రచయితలందరూ కరెక్టుగానే ఊహిస్తారనే నా ఆలో చన తప్పని తెలుసుకున్నాను. అసలు సంగతి నాకి ప్పుడు తెలిసినందుకు నాకు హేపీ ఇప్పుడు.

★